
# రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది



## బీనాదేవి

"మాకు మంచి ఎంకరేజిమెంటిస్తారు" అంటారు కుర్రకారు లాయర్లు.

"తెలివైన బుర్ర" అంటారు తల నెరిసిన వకీళ్ళు.

"కష్టం, సుఖం తెలిసిన మనిషి" అంటారు ప్లీడరు గుమాస్తాలు.

"ధర్మ ప్రభువు" అంటారు అతని స్టాఫు.

"న్యాయం కనిపెట్టేస్తారు" అంటారు పార్టీలు.

"నా పూర్వజన్మ సుకృతం" అంటుంది సుగుణమ్మ.

ఇంతపేరు తెచ్చుకున్న సబ్ జడ్జీ సౌజన్యరావుగారికి, అప్పుడే సెంటును వాసన చూసినట్టుండే ముక్కుగల సుగుణమ్మ అనే పతివ్రత అయిన భార్యా, బియస్సీ మూడో యేడు చదువుతున్న పెద్దకూతురు రెండుజడల రాధ, తర్వాత మరో ముగ్గురు పిల్లా పిచికా వున్నారు. నలభైఎనిమిదేళ్ళ వయస్సైనా తరగని దబ్బపండులాటి శరీరచ్ఛాయ, పెద్దపిల్లపెళ్ళి వాయిదాపడుతోందనే బెంగకూడా వున్నాయి.

అతను ఉత్త పాతకాలమ్మనిషి. బ్రిటీషుకాలంనాటి జడ్జీల్లా ఎవరితోనూ ఎక్కువ కలియకుండా తామరాకుమీద నీరులా తప్పించుకు తిరుగుతారు. యానివర్సరీనాడు మాత్రం క్లబ్బుకెళతారు. కోర్టూ యిల్లూతప్ప యింకెక్కడికీ వెళ్ళని ఖచ్చితం మనిషి. పరాయిచోట పచ్చి మంచినీళ్ళైనా పుచ్చుకోరు. దురలవాట్లు కూడా ఏవీలేవు. పొడుం పీల్చరు. కాఫీ రెండుసార్లు పుచ్చుకుంటారు రోజుకి. సిగరెట్టు కాల్చరు. సినిమాకి వెడతారు. కాని అవేవీ అతని వ్యసనాలని చెప్పుకోడానికి వీల్లేదు. కాఫీ లేపోతే ఓల్టీను తాగి గడిపేసుకుంటారు. ఎంతమంచి సినిమాలైనా నెలాఖరులోవస్తే పనిరద్దీవల్ల వెళ్ళరు.

అతనికున్న ఒక్క వ్యసనవూ చదరంగం. ఉన్న ఒక్క స్నేహితుడనిపించుకోదగ్గవాడూ వారి వీధిచివర కాపురవున్న ఏభైఅయిదేళ్ళ లింగన్న పంతులు. వారికి ఆ వ్యసనవూ ఆ స్నేహవూ కూడా విచిత్రంగానే సంప్రాప్తమయ్యాయి.

ఆయన చిన్నప్పుడారేళ్ళు వచ్చే

దాకా గోళీలు, తొమ్మిదేళ్ళొచ్చేదాకా గోటీబిళ్ళా ఆడేవారు. తర్వాత పన్నెండేళ్ళొచ్చేదాకా ఏమీ ఆడేవారుకారు. తర్వాత ఓ మూడేళ్ళు ఫుట్‌బాలూ, తర్వాతో నాలుగేళ్ళు హాకీ ఆడేవారు. తనే పంథొమ్మిదో ఏట ప్రారంభించిన టెన్నిస్, క్రితం వూళ్ళో కొన్నాళ్ళు పనిచేసేవరకూ ఆడేవారు. ఆ వూళ్ళో ఆయన తోటి మునసబుగారు కూడా టెన్నిస్ ఆడేవారు. వీరిద్దరితో కొంతమంది వకీళ్ళు కూడా ఆడేవారు. అప్పుడో సారి జిల్లా జడ్జిగారు ఆయన్నీ, మునసబుగార్నీ పిలిచి 'మీరు టెన్నిస్ ఆడే వకీళ్ళకే ఏవో వాయిదాలవీ యిస్తున్నారని పిటీషనులు రాస్తున్నారు ఎవరో పుండాకోర్లు. మీ గురించి నాకెటువంటి అనుమానవూ లేదు. కానెందుకైనా మంచిది. కొంచెం జాగ్రత్తగా ఉండండి' అన్నారు. దాంతో వారిద్దరి మనసులూ ఒక్కసారి చివుక్కుమని "కొంచెమేంఖర్మ, బాగానే జాగ్రత్తపడతాం' మని ఒక్కసారిగా టెన్నిస్ మానేసేరు.

టెన్నిస్ మానేసిన యిద్దరూ కాలక్షేపంకోసం చదరంగం నేర్చుకున్నారు. అలా అంటించుగున్న చదరంగం మరి వొదుల్చుకోలేకపోయేరు జడ్జిగారు. క్రితం ఊళ్లో వున్నన్నాళ్ళూ ఆటకేం ఆటంకం లేకపోయింది మున్సబుగారుండబట్టి. కాని, ఈ వూరొచ్చేకమాత్రం బహు చిక్కొచ్చిపడింది ఆయనకి. లాయికా లూకాయిగాళ్ళతో ఆడకూడదాయన. లాకాయి లూకాయి గానివాళ్ళకి ఎతురాదు. ఏంచేసేదీ లేక యీ ఊరొచ్చేక భార్యకే నేర్పేరు చదరంగం. పాపం! ఆవిడకూడా తెలివైన ఘటువే. కష్టపడి నేర్చుకుంది ఆట. ఈ ఆట యింత బావుంటుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. మహా బావుందనుకుంది.

బావులేంది జడ్జిగారికే. పాపం! ఆయనకి భార్యంటే అమితప్రేమా, గౌరవమూనూ. పెళ్ళాంగా ప్రేమించేరు. మనిషిగా గౌరవించేరు కాని–కాని రైవల్ ప్లేయర్‌గా మాత్రం గౌరవించలేకపోయేరు. కారణం ఆవిడది తనంత తెలివైన బుర్ర కాకపోవడమేనా కావచ్చు; లేకపోతే ఆటకి ఆవిడ కొత్తవడమన్నా కావచ్చు. ఏదైతేనేం, పర్యవసానం జడ్జిగారికి తన భార్యతో ఆడితే చదరంగం రక్తి కట్టేదికాదు. మంచివాడు కాబట్టి, నొచ్చుగుంటుందని ఆమెతో ఆ మాటెన్నడూ చెప్పలేదు అతను.

ఇంక లింగన్నపంతులు స్నేహం ఎలా అయిందీ అంటే–ఈ ఊరొచ్చిన మూణ్ణెళ్ళకే జడ్జిగారి తండ్రిగారి ఆబ్దీకం వచ్చింది. తద్దినానికి వస్తానన్న భోక్తలెవరో దగాచేస్తే పురోహితుడు వీధి చివరనున్న లింగన్నపంతులు కాళ్ళట్టుకుని భోక్తగా తీసుకొచ్చేడు. వస్తూనే తనకిటువంటి భోక్తపన్లూ, తద్దినాలూ అలవాట్లేదనీ, ఏదో భగవంతుడిచ్చినదాన్తో గుట్టుగా కాలక్షేపం చేస్తున్నానని మర్యాదగా జడ్జిగారికి తెలియజెప్పేడు లింగన్నపంతులు. దానితో జడ్జిగారికి లింగన్నపంతులికి తానుపడ్డ ఋణం పెరిగినట్లనిపించింది. ఏదెట్లున్నా సమయానికొచ్చి కాపాడాడదే చాలనుకున్నారు జడ్జిగారు.

భోజనాలయ్యేక వీధరుగుమీద ఆమాటా యీమాటా చెప్పుకుంటూ కూర్చున్నారు జడ్జిగారూ, లింగన్నా. టేబిలుమీదున్న చదరంగం అట్టా, పావులడబ్బా చూసి 'జడ్జిగారు చదరంగం ఆడతారా?' అని జడ్జిగారిని అడిగాడు లింగన్న.

'ఔనన్నట్టు నవ్వుతూ 'తమకేమన్నా ప్రవేశమా?' అని బదులడిగారు జడ్జిగారు.

'ఏదో చిన్నప్పుడో ఎత్తువేసేవాణ్ణి' అన్నాడు సిగ్గుపడుతూ పంతులు.

అలా సెటిలయిపోయింది వాళ్ళిద్దరిమధ్యా రోజూ సాయంత్రం ఓ ఎత్తు వేసుకునే అలవాటు. కోర్టునుంచి ఎంత ఆలస్యంగా వచ్చినా, తానొచ్చేసరికే లింగన్న రాకపోతే కబురెట్టి మరీ ఓ ఎత్తువేయందే జడ్జిగారికి నిద్రొచ్చేదికాదు. కరెంటుపోతే కొవ్వొత్తి పెట్టిఅయినాసరే వేస్తారో ఆట వాళ్ళిద్దరూ. తొలిరోజులోనే ఆ మాటా యీమాటా చెప్పుకుంటున్నప్పుడు లింగన్నపంతులు, తన తండ్రిగారి కాలంలోనే వాళ్ళ కుటుంబానికున్న లిటిగేషను చెల్లిపోయిందనీ, తను ఎదిగి పంచెకట్టేక కోర్టుఛాయలకే పోలేదనీ చెప్పేశాడు. దానితో జడ్జిగారు యితనితో ఎంత స్నేహంగావున్నా ఫర్వాలేదనుకొని అతనితో నేస్తంపట్టేరు. వారిద్దరి శాఖలూ ఒకటే అవడంవల్ల మరీ జడ్జిగారింట్లో మనిషైపోయేడు పంతులు.

## 2

లింగన్నపంతులు కూడా తనకు రెండు తరాలనుండీ వస్తున్న అయి

---

● బీదవారిపై కాంపోజిషన్ రాయమని నాలుగోక్లాను కుర్రాళ్ళని మేష్టారడిగారు.

లక్షాధికారికొడుకు కోటీశ్వర్రావు రాసిన కాంపోజిషను : 'అనగనగా ఒక బీద కుటుంబము గలదు. ఆ కుటుంబములో అందరూ బీదవారే. తండ్రి బీదవాడు; తల్లి బీదది; కొడుకులు, కూతుళ్ళు బీదవారు. వారి కారు డ్రయివరు యింకను బీదవాడు; వారి తోటమాలికూడా బీదవాడే; వారి నౌకరు లందరు బీదవారే... ... ...' ఈ పద్ధతిలో నడిచింది.

దెకరాల మాగాణీ, డైబెటీసూ ఎక్కడికీ పోకుండా కాపాడుకుంటూ గుట్టుగా కాలక్షేపంచేసే మనిషి. ఇతరలతో అంతగా జోక్యం పెట్టుకునే మనిషికాడు. తన సొంతపొలం చేసుకుంటూ, ఊళ్ళో లేని మరో దూరబ్బంధువుల పొలాలు మేనేజిమెంటుచేస్తూ, రెంటిమీద వచ్చిందాన్తో ఎలాగో కాలం వెళ్ళబుచ్చుకుంటున్నాడు. పెళ్ళాంపోయిన లతనికి మూడుసార్లు పి. యు. సి. తప్పి ఉద్యోగంలేని రాజేశ్వర్రావు పురఫురాజనే పెద్దకొడుకూ, పెళ్ళికానీ, పురఫులు కానీ లేని రాజేశ్వరనే పెద్ద కూతురూ, తర్వాత ఓ యిద్దరు నత్తా, నావావున్నారు. నత్తనాలుగో ఫారం చదువుతున్నాడు, నాంవ నాలుగో క్లాసు చదువుతోంది.


లింగన్న పంతులు మంచివాడని కాని, చెడ్డవాడనిగాని ఎవరూ అనరు. తన జీతం పిచ్చకుంచంతో కొలుస్తాడని పాలే రనడు. చచ్చిన అతని పెళ్ళాంమాత్రం, తను పుట్టింటికి పోయినప్పుడు పంతులు దాసి రాజమ్మ చెయ్యట్టుగుంటున్నా డనే అనుమానపడి, ఒకటి రెండుసార్లు తన అనుమానం వ్యక్తం చేసినప్పటికీ యింకెవరూ ఆ మాటనలేదు. ఎవరికిఇవ్వాల్సింది వాళ్ళకి ముందుగానే ఇచ్చేస్తూ, తనకు రావలసింది పైసా పోకుండా రాబట్టుకుంటూ, లౌక్యంగానే కాలక్షేపంచేసేమనిషి పంతులు. ఎలక్షన్రోజుల్లో ఉభయపార్టీలకి మీాకే ఓటిస్తానని నమ్మించి, తనకి తోచిన వాడికి గుట్టుగా ఓ వేసి, యిద్దరు పార్టీలవైపూ నవ్వుతూ చూస్తూ వచ్చేసే గడసరి.

చిన్నప్పట్నించీ చదువు చెప్పించి తర్వాత తాసిల్దారు కాళ్ళట్టుకుని ఎల్. డి. సి. ఉద్యోగం వేయించిన తన మేనల్లుడే తన్ను కట్నం అడిగేసరికి వొళ్ళు మండింది పంతులుకి. కట్నం వేంనా, కాసూ – మొహరూ కాకుండా మూడువేలదాకా తన బావమరిదికి(అంటే మేనల్లుడితండ్రికి) మనస్సుందనగానే మరీ వొళ్ళు మండిపోయింది. కాని, కోపం తెచ్చుకొని, నోరుపారేసుకొని, సంబంధం తెంచుకొనే మనిషికాడు ఆయన. ఏం చెయ్యాలో తోచక, కర్ర విరక్కుండా–పాము చావకుండా, కట్నం విషయం ఏమీ తేల్చలే దతను. రాజేశ్వరికి మూడుముళ్లూ పడీ, రాజు ఏ చిన్న ఉద్యోగంలోనైనా జొరబడితే బావుణ్ణు. వెనకపిల్లల కైముకు దేశం బాగుపడకపోతుందా అనుకుంటూ డెప్పుడూ పంతులు.

## 3

ఆ ఊరిపేరెత్తేసరికి రాజన్నరాజుగారూ, సుందర్రావు నాయుడూ తడతారందరికీ. ఊరంత పెద్దది కాకపోయినా, ఎప్పుడూ ఇంగ్లీషు సినిమాలెయ్యని నాలుగు హాల్సు, సంవత్సరానికైనా జీతాలందని మేష్టర్ల






చేత ఓ స్కూలు, యింకేదో కారణం వల్ల పిల్లల్చేత ఓసారీ ముచ్చటగా సమ్మె చేయించుగునే ఓ కాలేజీ, సబుకోర్టుతో సహా నాలుగు సివిల్, క్రిమినల్ కోర్టులూ, డెభ్భైవేల జనాభాతో కోలాహలంగా వుంటుంది.

రాజన్నరాజుగారిది జమీాందారీ కుటుంబం కాకపోయినా, జమీాందార్లతో తూగగల తాహతూ, దర్జా వున్నాయా కుటుంబానికి. మూడు తరాల్నుంచీ తరానికొక రేకావడంవల్ల ఆ కుటుంబంతాలూకు మూడొందలెకరా కరిగిపోకుండా అచ్చోసిన బంగారు ముక్కలా నిలబడే వుంది. తాత రాజన్నరాజుగారు – అంటే ప్రస్తుతం వున్నవారి తాతగారు – జరీకోటు తొడుక్కొని, గుర్రమెక్కి పొలాలమీాది కెడుతూ వుంటే అచ్చంగా సత్యహరిశ్చంద్రుడు వేటకెడుతున్నట్టుందనుకొనేవారట. వారి కుమారుడు సుబ్బరాజులుంగారు

కూడా గుఱ్ఱమెక్కక పోయినా, మైసూరెడ్లబండీ మొత్తాలమీద కూర్చుని, పాలేర్ని ముందు పరిగెట్టిస్తూ దర్జాగా వెళ్తూ వుంటే రివిన్యూ ఇనస్పెక్టర్లు వంగి దణ్ణాలెట్టేవారట. వారు కాలం చేసేలోగానే కొమారుడు రాజన్రాజు కాంగ్రెసు టిక్కెట్టు కోయించుకుని అసెంబ్లీలో కాలుపెట్టిన భాగ్యం చూసుకోగలిగేరు. రాజన్రాజుగార్ని పేరెట్టి ఎవరూ పిలవరు. ఆత్మీయులు తాతం రాజుగారనీ, పైవాళ్ళు ఎం. ఎల్. ఎ. రాజుగారని పిలుస్తారు. వారు రెండు సార్లు ఎసెంబ్లీ పోటీల్లోనెగ్గి మూడో సారి ఓడిపోయేరు కాంగ్రెసు టిక్కెట్టున్నప్పటికీ.

మొన్న మొన్నటిదాకా రాజన్రాజుగారి ఆరోప్రాణమైన రామచంద్రావునాయుడుకూడా వరస మూడు టరమ్లు ఛైర్మనై, ఛైర్మన్నాయుడని సార్థకనామంసంపాయించుకున్నాడు. క్షత్రియుడు కాకపోయినా రాచవారికున్న పౌరుషం, స్నేహభావం వీరికీ వున్నాయి. వీరికీవుందో వందన్నర ఎకరా. బ్రిటీషు వాళ్ళ కాలంలో జిల్లా కలెక్టరుగా రీవూరుకేంపొచ్చినప్పుడు వీరి కుటుంబంనుంచే గొర్రెపోతులూ, కోడిపెట్టలూ సప్లయి అయ్యేవి. తన పొలం సాగుచేసుకుంటూ, ఓ సినిమా హాలు కట్టించుకుని, తన మూడో టరను ఛైర్మనుగిరీ అనుభవిస్తున్న నాయుడుకి, తనకంటె నాలుగేళ్ళు పెద్దయిన రాజన్రాజుగారంటే భక్తి, భయంకూడా. ఇద్దరూ కాంగ్రెసు వాళ్ళే అయినా, ఒకరికొకరు ఎలక్షన్లలో సాయంచేసుకుంటూ స్నేహం వృద్ధిపర్చుకుంటూ వుండేవారు. తానెప్పటికైనా ఎమ్. పి. అయితే తన ఎం. ఎల్. ఏ. పదవి నాయుడు కొదిలేద్దామని రాజుగారి ఆశ, ఆశయమూను. రాజుగారు ఎసెంబ్లీ ఎలక్షనొచ్చినప్పుడు, తన ఊర్ని నాయుడి కొదిలేస్తాడు. తాను యితర గ్రామాలు చూసుకుంటాడు. నాయుడు కూడా తనశక్తికి మించి పనిచేస్తాడు రాజుగారికోసం. ఇంక మునిసిపల్ ఎలక్షన్లొస్తే నాయుడు బరువు సహంపైగా రాజుగారే తన మీద వేసుకుంటారు. సోడాకొట్టు సాయిబు దగ్గర్నించీ, షేర్వాణీ తొడుక్కునే సుల్తాన్ సిల్కు పేలస్ ప్రొప్రయిటరు వరకూ, అందర్నీ తన తాహతు మరచి, గడ్డం పట్టుకొని నాయుణ్ణి, అతని పార్టీని గెలిపించమని ప్రాధేయపడతారు రాజుగారు.

వీరిద్దరి స్నేహం తెగ్గొట్టాలని కమ్యూనిస్టులూ, ఇతర చిల్లరపార్టీలూ ఎంత ప్రయత్నించినా లాభంలేక పోయింది. కాని ఆ దుర్దినం అనుకోకుండా దానంతటదే వచ్చింది.

## 4

రాజుగారిది మూడో సారి ఎలక్షన్లో పోయింది. అంటే, రెండుసార్లు గెలిచి మూడోసారోడిపోయేరన్న మాట. ఓట్లు కౌంటింగైపోయేక ఓటమి మొహంలో కన్పించనీకుండా అందరితోటీ చనువుగా, సరదాగా మాట్లాడి, తన జీపులో వెళ్ళిపోతున్నా, లోపలోపల బాధపడక పోలేదు రాజుగారు. తాను నమ్మిన వాళ్ళిలా ఎందుకు దగాచేసేరా అని తర్కించుకున్నారు. ఎంతమంది దగా చేసేరని లెక్కించుకున్నారు. కలతపడ్డ మనస్సుతో కలతనిద్ర పోయేరారాత్రి.

మర్నాడు ప్రొద్దున్నే ఎలక్షను గొడవలవతలబెట్టి మంగలి నర్సికి కబురుపెట్టేరు. తాను రెణ్ణాలై లక్ష్యపెట్టని జుట్టు క్షౌరం చేయించుకుందామని.

నరిసి వచ్చేడు. క్షౌరం ఆరంభించేడు. రాజుగారి గంభీరత చూసి మాట కలపలేక పోయేడు. ఓ పది నిముషాలు కత్తెర చప్పుడుతప్ప యింకేశబ్దం వినిపించలేదు.

'ఏదేతైనా న్నాయుడుగోరి దగా బైటపడిపోనాది,' అన్నాడు నరిసిగాడు వెనకాముందూ లేకుండా. రాజుగారి గుండె కొట్టుకోనేక్రమం ఓసారి తప్పింది. కాని బైటకు ఏవీఁ తేల్లేదు. నీరసంగా ఓసారి నవ్వారుకున్నారు రాజుగారు.

రాజుగారు తన్ననందుకు ధైర్యం వచ్చింది మంత్రి నరిసికి. ఇహ తను విన్నదీ, విననిదీ చెప్పేవచ్చని మొదలెట్టాడు. 'బాబుగోరికి తెలవదుగాని మన్నాయుడుగోరే మన్ని దగా చేసేట్ట. ఓట్సులెక్కేతప్పుడు తవఁరుగోరు బైటుండిపోనారుగాని మనూళ్ళోనే మనకి తక్కువొచ్చేయట ఓట్సులు. నాయుడుగోరి వోర్డులో పావలాభాగం కూడా పడనేదట మనకి' అన్నాడు.

ఇంక రాజుగారూరుకోలేక పోయేరు. 'నీ కెవరు చెప్పార్రా గాడిదా?' అనడిగేరు. ఆ గాడిదా అన్నమాటలో కోపంలేదని గ్రహించిన మంత్రికి రాజుగారింట్లో పలావు విందుకి పిలిచినట్లనిపించింది. 'తవఁరట్టాగే అనుకుంటూ వుండండి బాబయ్యా! ఊరంతా కోడై కూస్తుంటేనూ! రేతిరి మా యీచ్చివర బడ్డీకొట్టుకాడ కమ్మూనిట్టుకుర్రాళ్ళు పబ్లీగ్గా అంటూంటే! తవఁరిగోరిదో మాలోకం. నా మాటబద్దవైతే ఓట్సు నెక్కలు తెప్పించుకుని సూడగూడదా' అన్నాడు.

క్షౌరం తర్వాత నరిసి రాజుగారికి తలంటుతూ 'మనమీద నిలబడ్డది కిష్టారావు నాయుడేగందా. అలా తప్పుడు మఁ మనం న్నాయుణ్ణెందుకు నమ్మేవూఁ అంట?' అని పొడివేసేడు, తనుగూడా రాజుగారితో పాటు నాయుణ్ణి నమ్మి మోసపోయినట్టు.

తలంటయ్యేక రాజుగారి బుఱ్ఱ చురుగ్గా పని చెయ్య నారంభించింది. తర్వాత నర్సి చెప్పిన 'ఓట్సు లెక్కలు' చూస్తే వాడు చెప్పిన

కూడా గుర్రమెక్కక పోయినా, మైసూరెడ్లబండీ మొత్తాలమీద కూర్చుని, పాలేర్ని ముందు పరిగెట్టిస్తూ దర్జాగా వెళ్తూ వుంటే రివిన్యూ ఇనస్పెక్టర్లు వంగి దణ్ణాలెట్టే వాళ్టట. వారు కాలం చేసేలోగానే కొమారుడు రాజన్నాజు కాంగ్రెసు టిక్కెట్టు కోయించుకుని అసెంబ్లీలో కాలుపెట్టిన భాగ్యం చూసుకోగలిగేరు. రాజన్నాజుగార్ని పేరెట్టి ఎవరూ పిలవరు. ఆత్మీయులు తాతం రాజుగారనీ, పైవాళ్ళు ఎం. ఎల్. ఎ. రాజుగారని పిలుస్తారు. వారు రెండుసార్లు ఎసెంబ్లీ పోటీల్లో నెగ్గి మూడో సారి ఓడిపోయేరు కాంగ్రెసు టిక్కెట్టున్నప్పటికీ.

మొన్న మొన్నటిదాకా రాజన్నాజుగారి ఆరోప్రాణమైన రామచంద్రావునాయుడుకూడా వరస మూడు టరన్లు ఛైర్మనై, ఛైర్మన్నాయుడని సార్థకనామంసంపాయించుకున్నాడు. క్షత్రియుడు కాకపోయినారాచవారికున్న పౌరుషం, స్నేహభావం వీరికి వున్నాయి. వీరికివుందో వందన్నర ఎకరా. బ్రిటీషువాళ్ళ కాలంలో జిల్లా కలెక్టరుగా రివూరుకేంపొచ్చినప్పుడు వీరి కుటుంబంనుంచే గొర్రెపోతులూ, కోడిపెట్టలూ సప్లయి అయ్యేవి. తన పొలం సాగుచేసుకుంటూ, ఓ సినిమా హాలు కట్టించుకుని, తన మూడో టరను ఛైర్మనుగిరీ అనుభవిస్తున్న నాయుడుకి, తనకంటె నాలుగేళ్ళు పెద్దయిన రాజన్నాజుగారంటే భక్తి, భయంకూడా. ఇద్దరూ కాంగ్రెసు వాళ్ళే అయినా, ఒకరికొకరు ఎలక్షన్లలో సాయంచేసుకుంటూ స్నేహం వృద్ధిపర్చుకుంటూ వుండేవారు. తానెప్పటికైనా ఎమ్. పి. అయితే తన ఎం. ఎల్. ఏ. పదవి నాయుడు కొదిలేద్దామని రాజుగారి ఆశ, ఆశయమూను. రాజుగారు ఎసెంబ్లీ ఎలక్షనొచ్చినప్పుడు, తన ఊర్ని నాయుడి కొదిలేస్తాడు. తాను యితర గ్రామాలు చూసుకుంటాడు. నాయుడు కూడా తనశక్తికి మించి పనిచేస్తాడు రాజుగారికోసం. ఇంక మునిసిపల్ ఎలక్షన్లొస్తే నాయుడు బరువు సహంపైగా రాజుగారే తన మీద వేసుకుంటారు. సోడాకొట్టు సాయిబు దగ్గర్నించీ, షేర్వాణీ తొడుక్కునే సుల్తాన్ సిల్కుపేలస్ ప్రొప్రయిటరు వరకూ, అందర్నీ తన తాహతు మరచి, గడ్డం పట్టుకొని నాయుణ్ణీ, అతని పార్టీనీ గెలిపించమని ప్రాధేయపడతారు రాజుగారు.

వీ రిద్దరి స్నేహం తెగ్గొట్టాలని కమ్యూనిస్టులూ, ఇతర చిల్లరపార్టీలూ ఎంత ప్రయత్నించినా లాభంలేక పోయింది. కాని ఆ దుర్దినం అనుకోకుండా దానంతట దే వచ్చింది.

## 4

రాజుగారిది మూడో సారి ఎలక్షన్లో పోయింది. అంటే, రెండుసార్లు గెలిచి మూడోసారోడిపోయేరన్న మాట. ఓట్లు కౌంటింగైపోయేక ఓటమి మొహంలో కన్పించనీకుండా అందరితోటీ చనువుగా, సరదాగా మాట్లాడి, తన జీపులో వెళ్ళిపోతున్నా, లోపల్లోపల బాధపడక పోలేదు రాజుగారు. తాను నమ్మిన వాళ్ళిలా ఎందుకు దగాచేసేరా అని తర్కించుకున్నారు. ఎంతమంది దగా చేసేరని లెక్కించుకున్నారు. కలతపడ్డ మనస్సుతో కలతనిద్ర పోయేరారాత్రి.

మర్నాడు ప్రొద్దున్నే ఎలక్షను గొడవలవతలబెట్టి మంగలి నర్సికి కబురుపెట్టేరు. తాను రెణ్ణాలై లక్ష్యపెట్టని జుట్టు క్షౌరం చేయించుకుందామని.

నరిసి వచ్చేడు. క్షౌరం అరంభించేడు. రాజుగారి గంభీరత చూసి మాట కలపలేక పోయేడు. ఓ పది నిముషాలు కత్తెర చప్పుడుతప్ప యింకేశబ్దం వినిపించలేదు.

"ఏదేటైనా న్నాయుడుగోరి దగా బైటపడిపోనాది," అన్నాడు నరిసిగాడు వెనకాముందూ లేకుండా. రాజుగారి గుండెకొట్టుకొనే క్రమం ఓసారి తప్పింది. కాని బైటకు ఏమీ తేలేదు. నీరసంగా ఓసారి నవ్వారుకున్నారు రాజుగారు.

రాజుగారు తన్ననందుకు ధైర్యం వచ్చింది మంత్రి నరిసికి. ఇహ తను విన్నదీ, విననిదీ చెప్పేవచ్చని మొదలెట్టాడు. "బాబుగోరికి తెలవదుగాని మన్నాయుడుగోరే మన్ని దగా చేసేట్ట. ఓట్సు లెక్కేతప్పుడు తవఁరుగోరు బైటుండిపోనారుగాని మనూళ్ళోనే మనకి తక్కువొచ్చేయట ఓట్సులు. నాయుడుగోరి వోర్డులో పావలాభాగం కూడా పడనేదట మనకి" అన్నాడు.

ఇంక రాజుగా రూరుకోలేక పోయేరు. "నీ కెవరు చెప్పారా గాడిదా?" అనడిగేరు. ఆ గాడిదా అన్నమాటలో కోపంలేదని గ్రహించిన మంత్రికి రాజుగా రింట్లో పలావు విందుకి పిలిచినట్లనిపించింది. "తవఁరట్టాగే అనుకుంటూ వుండండి బాబయ్యా! ఊరంతా కోడైకూస్తుంటేనూ! రేతిరి మా యీఛ్చివర బడ్డీకొట్టుకాడ కమ్మూనిట్టుకుర్రాళ్ళు పబ్లీగ్గా అంటూంటే! తవఁరిగోరిదో మాలోకం. నా మాటబద్దమైతే ఓట్సు నెక్కలు తెప్పించుకుని సూడగూడదా" అన్నాడు.

క్షౌరం తర్వాత నరిసి రాజుగారికి తలంటుతూ "మనమీద నిలబడ్డది కిష్టారావు నాయుడేగందా. అలాతప్పుడు మరి మనం న్నాయుణ్ణెందుకు నమ్మేవూఁ అంట?" అని పాడేసేడు, తనుగూడా రాజుగారితోపాటు నాయుణ్ణి నమ్మి మోసపోయినట్టు.

తలంటయ్యేక రాజుగారి బుర్ర చురుగ్గా పని చెయ్య నారంభించింది. తర్వాత నర్సి చెప్పిన "ఓట్సు లెక్కలు" చూస్తే వాడు చెప్పిన

దాన్లో నిజం లేకపోలే దనిపించింది. తర్వాత భోంచేసి పందిరిమంచం మీద వెల్లకిలా పడుకొని దోమతెరగళ్ళు నూటపదమూడుదాకా లెక్కెట్టే సరికి నర్సి చెప్పింది నిజమే ననిపించింది. అగ్గికి ఆజ్యం పోస్తూనే వున్నారు ఊళ్ళోవాళ్ళు. రాజుగారి అనుమానం కొన్నాళ్ళకి నమ్మకంకింద మారిపోయింది. కాని, ఆయన పైకి తేల్లేదు. నాయుణ్ణి మామూలుగానే కలుసుకుంటున్నాడు. నాయుడికూడా తను రాజుగార్ని దగా చేసేనని ఊళ్ళో అనుకుంటున్నారని తెలుసు. కాని, ఆ ప్రసక్తి రాజుగారెత్తందే నే నెందు కెత్తాలని వూరుకున్నాడు.

ఎలక్షనైన ఓ నెలాళ్ళకు రాజుగారు నాయుణ్ణి పిలువనంపేరు. కబురందగానే హాజరయ్యేడు నాయుడు. ఆమాటా యీమాటా ఆడుకున్నాక రాజుగారు తన పేమునేసిన కర్ర యీజీఛైర్ చేతులమీద తన కాళ్ళు రెండూ "వార్‌గన్స్" లా పెట్టి "ఎలక్షనెలాగాపోయింది. ఏదేనా బిజినెస్ చెయ్యాలనుందోయ్ నాయుడూ" అన్నారు. అలా అంటున్నప్పుడు నాయుడు సినిమాహాలు తాను ప్రారంభోత్సవం చేసే ముందు, నాయుడు తనని తనకు తోచిన వాటా హాల్లో తీసుకోమనడం, "ఏదో బిజినెస్సులోకి కొత్తగా దిగేవు. నువ్వేకానీ" అని తను నాయుడుతో అనడం పూర్తిగా జ్ఞాపకం వున్నాయి రాజుగారికి. కాని ఆ విషయం మరచిన నాయుడు "చిత్తం. ఏలైను మీదుంది తమమనసు?" అనడిగాడు. రాజుగారు కాస్సేపాగి "అదేనోయ్ తోచడంలేదు.—పోనీ నీహాల్లో ఏదేనా వాటా తీసుగుంటే..." అని అసంపూర్తిగా వాక్యం వదిలేసి నాయుడు తనవేపు చూడ్డంలేదని తెలుసుకుని అతని కళ్ళవేపు పరీక్షగా చూసేరు.

నాయుడుకి నవ్వాలో ఏడవాలో తెలీలేదు. మూడుహాల్సుతో కాంపిటీషను నిలబళ్ళేక తనే సతమతమైపోతూవుంటే తన హాల్లో రాజుగారికి వాటా యివ్వడం, ఆయనకి అపకారం చెయ్యడమే అనిపించింది. ఓ క్షణం ఆలోచించి "తమమాట నేనెప్పుడూ కాదన్ను! కాని ఓమాట చెప్పకుండా వుండలేను. సినిమాలైనేం బావులేదు. క్రిందటేడు రాబడికీ, ఖర్చులుకీ సరిపోయింది. ఈ ఏడాదలా సరిపోతుందనే ఆశకూడా లేదు. తమరు ఎప్పుడు ఎంతవాటా కావాలన్నా నేను సిద్ధమే. అటుపైని..."

చేతిలో సిగరెట్టు కిటికీలోంచి బయటికి గట్టిగా గిరవాటేస్తూ రాజుగారు నాయుడు మాట కడ్డంవచ్చి. "అబ్బే అదేం కాదోయ్! నువ్వేం బాధపడకు. నేనిలా అడిగేనన్న విషయమే మర్చిపో. పోయిరా. పాపం ఏదో పనుందనుకుంటాను" అన్నారు.




నాయుడు నమస్కారంచేసి వెళ్ళిపోయేడు.

నాయుడింత దొంగ అనుకోలేదు. వాటా యివ్వటం ఇష్టం లేకపోతే సూటిగా చెప్పరాదా! దొంగవేషాలువేసి లేనినష్టం సృష్టించడ మెందుకు? అనుకున్నారు రాజుగారు తన్లో.

రాజుగారికీ, నాయుడుకీ బెడిసిపోయిందని ఊళ్ళో అందరూ పబ్లిగ్గావే అనుకోవడం ప్రారంభించేరు. వారిద్దరూ పైకిమాత్రం పూర్వంలాగే మాట్టాడుకుంటూ తిరుగుతున్నారు.

ఓనాడు రాజన్నాజుగారి దూరబ్బంధువూ, మంత్రీ అయిన సీతారామరాజుగారు వాళ్ళూరొచ్చే సందర్భాన వారికి నాయుడు మునిసిపాలిటీ తరఫున ఆహ్వాన సభ ఏర్పాటు చేసేడు. అసలు రాజన్నాజుగారు ఎలక్షన్లలో గెలిస్తే ఆ మంత్రి పదవి సీతారామరాజుక్కాకుండా, వారికే దక్కేదని అభిజ్ఞుల అంచనా. వీరు నెగ్గకపోవటం వల్ల వీరిముఠాకే చెందిన సీతామరాజుగార్ని ఆ అదృష్టం వరించిందంటారంతా. బండెడు పూలమాలలు వేసికొని మంత్రిగారు తన పూళ్ళో ఊరేగుతూంటే రాజుగారి వంటికామురం రాసుకున్నట్టున్నా, చడీచప్పుడూ లేకుండా మంత్రిగారి కారు వెనకే తన టూపు తీసేసిన జీపులో ఆ మంత్రిగారికి జరుగుతున్న గౌరవమంతా తనదేనని కనిపించేలా చిరునవ్వుతో మండు టెండలో ఊరేగారు, వారుకూడా.

మధ్యాహ్నం మూడు గంటలకి బస్‌స్టాండులో ఆరంభమయింది ఆహ్వాన సభ. అసలే ఒంటికామురం రాసుకున్నట్టున్న రాజుగారికి, దాని మీద కారం చల్లినట్లయింది, వారు వేదికమీద కాకుండా దిగువ కుర్చీల్లో కూర్చోవలసివచ్చినప్పుడు. "ఈ సున్నప్పిడతగాళ్ళపాటి చేయకపోయేనా, నాయుడికి నేను" అనుకున్నారు, వేదికమీద నాయుడికీ, మంత్రిగారికీ రెండు వైపులా స్వయంవరాని కొచ్చిన రాకుమారుల్లా కూర్చున్న కౌన్సిలర్లని చూసినప్పుడు.

నాయుడు స్వచ్ఛంగా తెలుగులో ఆహ్వానపత్రం చదువుతూవుంటే అందరూ శ్రద్ధగా విన్నారు. ఆహ్వాన


---

- "ఈ నెక్‌టై ఎంతక్కొన్నావురా?" అని తండ్రి కొడుకు నడిగాడు.
  "పదిరూపాయలు నాన్నా!"
  "ఓరి వెధవా! డబ్బు ఊరికే తగలేస్తున్నావ్, దాని బదులు మంచి చెప్పులజోడు వచ్చేదిగా."
  "బలేవాడివి నాన్నా! చెప్పులు మెడకి కట్టుకుని తిరగమంటావా?"

పత్రం అతిశయోక్తులూ, అతిపొగడ్తలూ లేకుండా, రెండు మూడు ససంద్రైన విట్లతో నిన సొంపుగా వుంది. అందులో మంత్రిగారిని భట్రాజులా కాకుండా పొగడాల్సినంత పొగిడాడు నాయుడు. 'ఇంత తెలివెక్కడిది నాయుడికి? తన మునిసిపల్ హైస్కూలు ఇంగ్లీషు, తెలుగు మేష్టర్ల చేత రాయించేసుగునుంటా' డని సర్దిచెప్పుకున్నారు రాజుగారు.

మంత్రిగారు సమాధానం చెప్పడానికి లేచారు. పాతకథల్లో కోయ జాతులవారిచే పట్టుకోబడి, వారిచే బలి యివ్వబడేముందు ముస్తాబు చేయబడ్డ రాకుమారుళ్ళా ఉన్నారు, మెళ్ళో మోయలేనన్ని పూలదండలతో. వారు ఏం శెలవిస్తారా 'అని ఆదుర్దాగా ఎదురుచూస్తున్న సభికులని ఓ నిమిషం నవ్వుతూ కలయజూసి, ఏం మాట్లాడకుండా తన మెళ్ళోవనూ, టేబిలుమీదా వున్న సగం దండలు నాయుడుమెళ్ళో వేసేరు నవ్వుతూ. ఈ సైలెంటు స్పీచికి సభలో విపరీతంగా చప్పట్లు కొట్టేరు. ఇదంతా చూడ్డం ఇష్టంలేని రాజుగారు పక్కనున్న ఎ. ఎస్. పి. తో ఏదో మాట్లాడ్డం ప్రారంభించారు.

మంత్రిగారు తమ సమాధానంలో 'మన్నాయుడు' యింతవాడనుకోలేదని, ముందు ముందు యితను అసెంబ్లీకి వచ్చి దేశాన్ని నడిపించగలడని పొగుడుతూవుంటే, అదివరకే ఆముదం రాసుకొని కారంజల్లుకున్నట్లున్న తమవంటికి దూలగుండాకు రాసినట్టు ఫీలయ్యేరు రాజుగారు. ఆ రాత్రి నాయుడు దేశమనే ఓ ఆశ






కూతుర్ని రెక్కట్టుకొని గొర గొరా యీడ్చుకుపోతున్నట్లు కలకూడా వచ్చిందాయనకి. సభ ముగిసేక, తమకు కలిగిన నిశ్చితాభిప్రాయం తమ కళ్ళలోగాని, దేహం తాలూకు మరే ఇతర భాగంలోగాని కనిపించనీయకుండా నాయుడికి షేక్‌హేండిచ్చి వెళ్ళిపోయేరు రాజుగారు.

ఇంతలో మునిసిపల్ ఎలక్షన్లొచ్చేయి. రాజుగారీ మారు నిలబడతారేమోనన్నట్లు నాయుడు ముందు రాజుగారి మనుషులు ఒకరిద్దరన్నారు. 'అంతా రూమర్లు. వారి కీదిన్న పన్లెందుకు' అన్నాడు నాయుడు. రాజుగారూ, నాయుడూ యుద్ధం చేస్తే చూద్దామని వారి శత్రువులకీ, వారిరువురికీ యిదివరకు మిత్రులైన వారికీకూడా కోర్కె కలిగింది.

ఇలా ఉండగా ఓ ఉదయం నాయుడింటిముందు రాజుగారి జీపు ఆగడం చూసిన వాళ్ళందరికీ ముచ్చటగా వుంది. మళ్ళీ జీపు బయలుదేరేలోపున ఓ ఏటంబాంబు పేలకపోతుందా అని వారి ఆశ.

నాయుడుతో రాజుగారు సూటిగా తన మనసులో వున్నదాన్ని వ్యక్తం చేసేసేరు—తనకీమారు చైర్మనవ్వాలని వుందనీ, నాయుడీమారు తప్పుగుంటే మంచిదనీ, కావాలంటే వచ్చేసారి నాయుడు ఎసెంబ్లీకి నిలబడ్డానికి తానడ్డురాననీ, యింకా కావాలంటే నాయుడొక వార్డునుండి కౌన్సిలరవడానికి తనకు అభ్యంతరం లేదని. రాజుగారు చెప్పిన ముఖ్యాంశాలు. నాయుడు ప్రాధేయపడ్డాడు. మునిసిపాలిటీ జోలికీ, తనజోలికీ రావద్దనీ, ఎసెంబ్లీకి నిలబడే తాహతు తనకు లేదని విన్నవించేడు. మన్లో మనకి దెబ్బలాట లొద్దని సలహా ఇచ్చేడు. కానీ తాను చైర్మనుగిరి నుండి తప్పుకోడానికి మాత్రం వప్పుకోలేదు. 'ఐతే నామాట కాదంటావన్నమాట' అన్నారు రాజుగార్లేస్తూ.

ఔననీ, కాదనీ బదులు చెప్పలేదు నాయుడు. రాజుగార్ని మాత్రం జీపు దాకా దిగబెట్టి, వారిజీపు తమ వీథిచివర సందు మళ్ళేదాకా అటే చూస్తూ వుండిపోయేడు.

ఆ సాయంత్రంనుండీ ఊళ్ళో హడావిడి పెరిగిపోయింది. ఇదివరకున్న పాతపార్టీలు మాయమైపోయేయి. మునుపు మునిసిపాలిటీలో అపోజిషన్ లీడరైన వరాల్సెట్టి, తాను చైర్మన్ కాకపోయినా ఫరవాలేదు కాని నాయుడవడానికి వీల్లేదనుకొని 'రాజుగారికీజై' అంటూ రాజుగారి పార్టీలో చేరిపోయేడు. ఇదివరకు వరాల్సెట్టి పార్టీలో వున్న క్షత్రియులు కొంతమంది, తమకి రాజుగారిమీదున్న కక్షకొద్దీ వరాల్సెట్టిని వొదిలేసి నాయుడి పార్టీలో చేరిపోయేరు. రాజుగారంటే మోజున్న నాయుడుపార్టీ మనుషులు రాజుగార్నే కొలుస్తూ వుండిపోయేరు.

నాయుడు, రాజుగారు మాత్రం ముఖాముఖీ ఢీకోలేదు. ఇద్దరూ చెరో వార్డునుంచీ నిలబడ్డారు. నాయుడు మీద తన వేలువిడచిన మేనల్లుణ్ణి నిలబెట్టారు రాజుగారు. రాజుగారిమీద తనసొంత బామ్మరిదినే నిలబెట్టాడు నాయుడు.

ఎలక్షన్లు దగ్గరకొస్తున్న కొద్దీ రోషాలూ, పౌరుషాలూ పెరిగిపోయేయి. రెండుపార్టీలూ చెరో నూటయాభై రిక్షాలు గుత్తకి పుచ్చుకున్నారు. మొదట్లో గోడలమీద "రాజుగారికే మీ ఓటు" అన్న మాటల పక్కగావుండేవి "నాయుడుకే మీ ఓటు" అన్నపదాలు. ఎలక్షన్లు దగ్గిర కొచ్చేకొద్దీ "నాయుడుకే మీ ఓటు" మీద "రాజుగారికే మీఓటు" అనీ, "రాజుగారికే మీ ఓటు" మీద "నాయుడికే మీ ఓటు" అనీ కనిపించసాగేయి. గోడలమీద రాసిందే చదువుకుని ఓటేద్దామనుకున్న వారికి మాత్రం రాజన్నాయుడుగార్కి ఓటెయ్యడమో, నాయుడురాజుగార్ని బలపర్చడమో తెలీలేదు.

ఎలక్షన్లో పదిరోజు లుందనగా రాజుగారి రిక్షావాణ్ణి, నాయుడు రిక్షావాడు కొట్టేడని ఓ క్రిమినల్ కేసు దాఖలైంది. ఆ మర్నాడు రాజుగారి జీపు నాయుడుపార్టీ రిక్షాని కావాలనే గుద్దిందని, జీపు డ్రైవరు మీద కేసు దాఖలైంది.

"వీడిబాబు సంతలా సీలుచేసుకునేవాడే కదా! వీడేం నాయుడు? చత్కారీ. నాయుడు" అని రాజుగారన్నారని ఓ పుకారు.

"ఇతనేంరాజు. దుంపల్రాజు. యితని పంక్తిని పూసపాటివారూ, చింతలపాటివారూ భోజనంకూడా చెయ్యరట. పెంకుల్రాజు" అని నాయుడన్నాడని మరోవదంతి.

"రాజుగారికి నాయుడు సినిమాహాల్లో మూజువాణీగా పావలా వాటా వుండేదనీ, దానికి కాగితంకలం లేకపోవడం చూసి నాయుడెగ్గొట్టేశేడని" ఓ అభియోగం. గత ఎలక్షన్లో రాజుగారికి నాయుడు మదుపెట్టిన పదివేలూ ప్రోనోట్లుని అవకాశం చూసుకొని రాజుగారెగ్గొట్టేరని యింకో అభియోగం.

రెండుమూడు కొట్లాటలు మినహాయిస్తే చల్లగానే జరిగిపోయేయి. రాజుగారి వేలువిడిచిన మేనల్లుడిదీ, నాయుడిబామ్మరిదీ పోయింది. రాజుగార్కి 55 ఓట్లు మెజారిటీ. నాయుడికి 54 ఓట్లు మెజారిటీ.

తర్వాత ఛైర్మను ఎన్నిక. లోపల్లోపల గూడుపుఠాణీల్తో నిండిపోయింది. ముసుగులో గుద్దులాటమాని సూటిగా పోటీచేశారు రాజుగారూ, నాయుడూను. రాజుగారిపార్టీలో ఎన్నికైన ఓ హరిజనుణ్ణి, తన సినీమాహాల్లో బీడీకొట్టు అతనికొడుక్కి అద్దెకిచ్చి లాగేశాడు నాయుడు. నాయుడుపార్టీలో చేరిన ఓ క్షత్రియుణ్ణి, అతని మాతామహుడిచే చెప్పించి, పిలకట్టుకీడ్చుకొచ్చేరు రాజుగారు తమ పార్టీలోకి. ఏ పార్టీ లేకుండా ఎన్నికైన ఓ కౌన్సిలర్ని డ్రెక్టరు కొనుక్కోడానికి అప్పిచ్చి తమ పార్టీలో కలుపుకున్నారు రాజుగారు. అలాగే ఎన్నికైన మరోడ్ని నువ్వు వేరే డ్రెక్టర్ను కొండం దేనికి? దానికి అప్పు చెయ్యడం దేనికి? నా డ్రెక్టరే వాడుకో" అన్జెప్పి నాయుడు లొంగదీసుకున్నాడు.

నాయుడు రాశి, రాజుగారి రాశి కూడా తిరిగిపోయేయన్నారు జ్యోతిష్కులు. ఇదివరకు ఎసెంబ్లీ ఎలక్షను పోయింది కాబట్టి యిప్పుడు రాజుగారు ఛైర్మన్నవాల్సిందే అని కూడా అన్నారు.

ఎలక్షను దగ్గరపడుతున్నకొద్దీ మొగ్గు రాజుగారివైపే ఎక్కువయింది. నాయుడు యిల్లు కదల్డం మానేశేడు. చెరో పాతికవేలకి చెయ్యి కడుక్కున్నారని ఊళ్ళో అనుకున్నారు.

ఓ నాడు మధ్యాన్నం 3 గంటలకి ఛైర్మను ఎన్నిక పెట్టేరు. రెండు ఓట్ల మెజార్టీతో నాయుడు గెల్చేడన్న వార్త ఔట్లతో ఊళ్ళోకి పేల్చబడింది.

ఈ లోగా ఎప్పుడు సిద్ధం చేయించాడో కాని, యాభై మంది మంగళ్ళ బేండుతోటీ, మరో సన్నాయి మేళంతోటీ, అయిదువేల మంది పార్టీ అనుచరుల్తోటీ ఊరేగేడు నాయుడు అద్దెకార్లో. బేండువాళ్ళు కసికొద్దీ వాయించారు రాజుగారింటిముందు. అక్కడే యాభై అవుట్లుకూడా పేల్చేరు నాయుడు అనుచరులు. ఆ రాత్రి సినిమాహాల్లో అందరికీ ఫ్రీగా మూడాటలూ చూపించేడు నాయుడు.

ఆ తర్వాత చాల్నాళ్ళు రాజుగారు యిల్లు కదలడం మానేసేరు. అసలతను ఊళ్లో ఉన్నదీ లేనిదీకూడా ఎవరికీ తెలీనివ్వలేదు.

నాయుడుకూడా చాలారోజులు విందు వినోదాల్లో మునిగిపోయేడు.

## 5

సాయంత్రం అయిదు కావస్తూంది. జడ్జీగారు బెంచి దిగుదామనుకుంటూన్నంతలో, కోర్టులోకి కొత్త వకీలుగా రావడం ఆశ్చర్యం కలిగించింది. ఆరడుగులెత్తు, పక్కల్నెరుస్తున్న జుట్టూ, తెలివితో మెరిసేకళ్ళూ,

---

● జోళ్ళషాపులో ఒకడు : "ఈ జోళ్ళు ఎన్నేళ్ళయినా మన్నుతాయని యెలా తెలుసు మీకు?"

యజమాని : "ఇవి ఒకసారి కొన్నవాళ్ళు మళ్ళీ కొనడం నేను చూడలేదండి. అందుకని."

శుభ్రమైన బట్టలూ, మెరుస్తున్నకొత్త గౌను, ఖరీదైన జోళ్ళూవున్న ఆయన్నుచూసే సరికి, యిదేదో హైదరాబాదు సరుకు, యిప్పుడు కాంపౌండులో కొచ్చిన కొత్తకారుకూడా వీరిదే అయ్యుంటుందనుకున్నారు జడ్జీగారు. ఇతనెందుకొచ్చుంటూడా అని జడ్జీగారాలోచిస్తూంటే, ఆ వకీలు 'మునిసిపల్ ఎలక్షను గురించి మాపార్టీ ఓ పిటీషనుదాఖలు చేసుకుంటూడు, యీవేళదాటితే పిటీషను లిమిటేషను పట్టిపోతుం'దని వినయంగా మనవిచేసి, వారిపార్టీ చేత అంటే రాజుగారి వేలువిడిచిన మేనల్లుడు రామరాజు చేత జడ్జీగారితో పిటీషనిప్పించేడు.

వెంటనే చైర్మన్నాయుడుమీద ఎలక్షను పిటీషనొచ్చిందన్నవార్త ఊరంతా గుప్పుమంది. నాయుడు తాను కౌన్సిలరవడంలో వందఓట్లు డబ్బిచ్చి కొన్నాడనీ, 34 చచ్చిపోయినవాళ్ళ ఓట్లు వేయించుకున్నాడనీ, మరో ముప్పైదాకా ఎలక్షన్నాడు ఊళ్లో లేనివాళ్ళఓట్లు తనపార్టీ మనుషులచేత వేయించుకున్నాడనీ, కొంతమంది ఓటర్లను ఫ్రీగా తన సినిమా హాల్లోకి వదలి వాళ్ళఓట్లు సంపాయించేడని ఆ పిటీషన్లోని ముఖ్యాంశాలు.

ఆ సాయంత్రం క్లబ్బులో రాజుగారు 'మా వకీలు సూర్యనారాయణరాజు పెద్దపేరున్నవాడు. ఆయన హైకోర్టు జడ్జీఅయ్యేలోగానే యీకేసు చేయించేసుకోగోవాలి' అన్నారు.

అదివిన్న నాయుడు 'కాబోయే హైకోర్టుజడ్జీ ఏంఖర్మ? వీలైతే హైకోర్టుజడ్జి చేసినవాణ్ణే లాక్కొస్తానా తరపున' అని హైద్రాబాదు రైలెక్కాడు. కాని హైకోర్టుజడ్జీ చేసినవాళ్ళని తన వకీలుగా పెట్టుగోడానికి వీల్లేదని విన్నాక, హైకోర్టు వకీలు ఉమాపతిని కుదుర్చుకు తిరిగొచ్చి, తన వకీలుకి యిదివరలో హైకోర్టుజడ్జి యిస్తావంటే వద్దనే శేట్టు అని అన్నాడు.

'ఇంక నాయుడ్ని ఛైర్మను కుర్చీలోంచి పీకేయడం రోజులుమీదపని' అని రాజుగారన్నార్ట.

అదివిన్న నాయుడు 'అంతగా అయితే యీ కుర్చీలోనే పిస్తోలుతో కాల్చుకు ఛస్తాగానీ ఖాళీచేస్తానా?' అన్నాట్ట.

## 6

ఆ నాడు జడ్జీగారికేం బావులేదు. నిజం చెప్పాలంటే ఆముదం తాగినట్టుంది. కడుపులో వికారంగానూ, మనసులో చికాగ్గానూ ఉంది. దానికారణం తాను విచారణ చేస్తున్న ఛైర్మను ఎలక్షను కేసుమాత్రం కాదు. ఆ వేళ సాయంత్రం టపాలో తన పినతండ్రికొడుకు దగ్గర్నించొచ్చిన ఉత్తరం ఆయన్నంత బాధపెడ్తోంది.





రాధని, సుగుణమ్మ పిన్తల్లికొడుకు విశ్వనాధం కొడుకు శర్మకి ఇద్దామని చిన్నప్పట్నించీ అనుకుంటున్న మాటే. రాధ, శర్మలతో సహా అందరికీ యిష్టమే. ఈ రోజుల్లో ఏమీ కట్నం లేకుండా చేసుకుంటారని కూడా జడ్జీగారనుకోలేదెప్పుడూ. రాధ పెళ్ళికి కట్నానికైతేనేం, ఖర్చులకైతేనేం ఆరువేలు కేటాయించారాయన. వీలైతే వచ్చే జ్యేష్ఠంలో పెళ్ళి చేసేద్దామని, కట్నంగురించి కాస్త మాట్లాడిపెట్టమని తన పిన్తల్లి కొడుక్కి రాసే రాయన. విశ్వనాధానికి 10 వేలదాకా ఆశున్నట్టు జవాబిచ్చేడు పిన్తల్లి కొడుకు.

కొడుకెంత ఎమ్. బి. బి. యస్సయితే మాత్రం ఇదివరకున్న బంధుత్వం, రాధ చిన్నప్పట్నించీ అనుకున్న మాటా మరిచిపోయి, యిప్పుడు పదివేలు పిండుదామని చూస్తాడా విశ్వనాధం, అని ఆలోచిస్తూ కోర్టునుండి యింటికి తిరిగొచ్చినాయన్ని వీధి వరండా దాటి లోపలికి తీసుగెళ్ళలేకపోయే యతని కాళ్ళు.

నిట్టూరుస్తూ వీధి వరండాలో యీజీఛైర్లో కూలబడ్డారు బట్టలు మార్చుగోకుండానే. వీధి వరండాలో లైటు వెయ్యలేదెవరూ చీకటి పడుతున్నా. ఇంట్లో అలికిడి కూడా ఏమీలేదు. సుగుణమ్మ పక్కింటికెళ్ళిందేమో అనుకున్నారు జడ్జీగారు.

పిల్లల్ని సినిమాకి పంపించి పక్కింటికెళ్ళకుండా నట్టింటో వంటచేసుకుంటున్న సుగుణమ్మ, భర్త వీధి వరండాలోనే కూలబడ్డం చూసి ఆత్రంగా వెళ్ళిందాయన దగ్గరికి. ఆయనేం మాట్లాడక పోవడంచూసి ఆవిడే పలకరించింది. ఆయనో పది నిమిషాలు బాధపడ్డాక చెప్పేశారు అసలు విషయం. అతనంత బాధా ఆమెకూడా పడి కాఫీకి నీళ్ళు స్టౌమీద పడేసి వచ్చి కూర్చుందాయన ప్రక్క మరో కుర్చీలో. సరిగ్గా ఆ టైములో వచ్చేడు లింగన్న, 'యీ వేళఎత్తుకు ఆలీసం ఐపోయినట్టుంది' అంటూ.

'రండి, కూర్చోండి పంతులుగారూ, యీవేళ మనసేంబావులేదు.' అంటూ ఆహ్వానించేరు జడ్జీగారు. ఆయనకి ఆ బాధలో లింగన్న ఆప్తబంధువులా కనిపించేడు. బాధలోవున్నప్పు డెవరికైనా, తన్ని బాధపెడుతున్నవాడు మినహా మరోప్రాణితోడుంటే చాలనిపిస్తుంది. ఆప్రాణే పరిచయస్తురాలైతే మరి చెప్పనక్కర్లేదు.

జడ్జీగారు విచారణచేస్తున్న పెద్ద ఎలక్షనుకేసే వారిని బాధపెడుతున్నాదనుకున్న లింగన్న పంతులు 'ఆ హైకోర్టు వకీళ్ళు కాల్చుకు తింటున్నార్లేవుంది తమర్ని' అన్నాడు సానుభూతిగా.

'ఏం హైకోర్టు వకీళ్ళో! ఏం పాడో! వేచుకుతింటున్నారనుకోండి. తన పార్టీ ఎలక్షన్లో గెలుచుకున్నాడు కాబట్టి కేసు వాయిదాలు వేయిం

చడంకోసం చూస్తాడా ఉమాపతి. వేటకుక్కలా కరిచేస్తాడు సాక్షుల్ని సూర్నాయణరాజు' అన్నారు జడ్జీగారు, తన్ని బాధపెడుతున్న హాంశం తాత్కాలికంగానైనా తన మనసులోంచి తప్పించినందుకు పంతులిని తన మనసులోనే అభినందించేడు కూడా.

ఈలోగా సుగుణమ్మ చెరోగ్లాసు కాఫీ వారిద్దరికి అందించి తానో కుర్చీలో కూలబడింది. జడ్జిగార్నేది బాధపెడుతోందో తెలీని లింగన్న 'తవఁగొప్ప తవఁదగ్గర చెప్పడంకాదు కానీండి! తవఁరు ఎంత పెద్దకేసైనా అవలీలగా కీలకం పట్టేస్తారని, ఏ సిఫార్సుకూ లొంగరనీ, తవఁ తీర్పులంటే హైకోర్టులో కూడా కళ్ళకద్దుకుంటారని అందరికీ తెలిసిపోయింది' అన్నాడు.

'ఎన్నుంటే ఏంలాభవండీ! అసల్లేకపోయేక' అన్నారు అర్థోక్తిగా.

పంతులుకి ఏవీఁ పట్టుబడ్లేదు.

'తవఁరేదో చికాకులో వున్నట్టున్నారు. మళ్ళీ దర్శనంచేస్తా' అంటూ లేవబోయేడు. నడిసముద్రంలో చిన్న ద్వీపంలో తనవద్ద వున్నఒక్కడూ తనని వదిలి వెళ్ళిపోతూన్నట్టనిపించింది జడ్జిగారికి.

'అయ్యయ్యో! కూర్చోండి. తమకంటె కావలసిన వాళ్ళెవరున్నారు మాకు? కూర్చోండి. కూర్చోండి' అంటూ కూర్చోపెట్టేసేరు లింగన్నని. కూర్చోపెట్టేక తన మనసులోవున్న బాధ వెళ్ళగక్కేశారు. బాధ వెళ్ళగక్కేక 'ఇప్పుడు నన్నేం చెయ్యమంటూరు చెప్పండి? పదివేలు కట్నం కావాలన్న ముండావాడు నా దగ్గరున్న ఆరు వేలూ ఖర్చులకింద తగలెట్టించకుండా వదుల్తాడంటూరా? ఎక్కణ్ణించి తెమ్మంటూరిప్పుడు పదివేలు? ఇహ యింత బతుకూ బతికీ మీలాంటివారెవరిద్వారానో లంచం కుదుర్చుకోవాలి' అన్నారు.

లింగన్న అనుభవశాలి. గడసరి. మాటకారి. ఎప్పుడే మాటలంటే ఎవరికి నచ్చుతుందో తెలుసు. తన మాటల్తో జడ్జిగారికి కొంత గాకపోతే కొంతైనా మనశ్శాంతి కుదిర్చిపెట్టేడు. ఆ తర్వాత వర్షం వస్తుందన్న తొందరవల్ల జడ్జిగారి శలవు తీసుకొని యింటికి బయలుదేరేడు. కాని, దార్లోనే వచ్చేసింది వానజల్లు.

## 7

వాన్లో తడిసి 'రాజేశ్వరీ' అంటూ తన బొమ్మరిల్లులాంటి నాలుగిళ్ళ వాకిలి మెట్లెక్కుతున్న లింగన్న పంతులు లోపలి వరండాలో పరాయి వాళ్ళున్నట్టు గ్రహించి, అశ్చర్యపడుతూ లోపలి కెళ్ళి ఇంకా అశ్చర్యపడిపోయేడు, కుర్చీలో కూర్చున్న నాయుణ్ణి చూసి. మూర్చొచ్చినంత పనైంది తన్ను చూసి నాయుడు లేవగానే.

'అయ్యో! అయ్యో!! తవఁరా!!! నాయుడుగారా? ఇంకే వుందింకేం వుంది? నేనేం అపరాధం చేశేను తవఁరిలా నన్ను శిక్షించడానికి?' అని నిలవదీశడిగాడు. 'తవఁరే రావాలా? కాకిచేత కబురంపితే తవఁ పాదాలవద్ద వాల్నా?' అని నచ్చజెప్పబోయేడు. 'ఏదేమైనా కుచేలు డింటికి శ్రీకృష్ణు డొచ్చినట్లుంది' అని ప్రశంసించాడు. లోపల్లోపల నాయుడి రాకక్కారణమేమైవుంటుందా అని ఆలోచిస్తూనే.

నాలుగుసార్లు ఛైర్మనైన నాయుడికి లింగన్న పంతుల్లాంటి వాళ్ళు కొత్తకాదు. అసలు విషయానికి రాకుండా లింగన్నపంతుల్ని, అతని క్షేమం, అతని పిల్లలక్షేమం అడిగాడు. వ్యవసాయమెలా సాగుతోందని ప్రశ్నించాడు. న్యారేమైనా కావాలా అని అడిగాడు, పి. యు. సి. పోయి యింట్లో కుర్రాడు రికామిగా కూర్చుంటే' తనతో చెప్పితే మున్సిపాలిటీలో ఓ రివిన్యూ యిన

స్వయంగా కోరి
శ్రమ తెచ్చుకోరుగదా

అవునా? అంతే. నిజం. కాని, శేర్లు, సౌన్లు అంటూ తూనికలలో మీరు బేరాలు సాగించినప్పుడల్లా మీరు చేసేది ఇదే.

ఇవి ఇప్పుడు న్యాయ చట్టవిరుద్ధమైన తూనికలు, వీటినుపయోగించే వ్యాపారి శిక్షాపాత్రుడు. కాని, మీరు తక్కువ తూకం పొందగలరు. అందుకంటే మీ డబ్బుకు రావలసినంత వరకూ రాక పోవడమే.



కిలోలల్లో మాత్రమే కొనండి

స్పెక్టరు పనైనా వేయించకపోయేనా అని, ఎందుకు చెప్పలేదని, నిందించేడు.

ఓ పది నిముషాలు దసరాఉత్సవాల్లో గరిడీ వాళ్ళలాగా అసలు విషయం దగ్గరకు రాకుండా, యిద్దరూ దూరదూరంగా సాము చేశారు. కొంతసేపయ్యేక అసలు విషయానికి దగ్గరగా రానారంభించాడు నాయుడు. "జడ్జిగారెలాంటివాడు" అనడిగాడు.

"కేసుల్సంగతి తెలీదు గానండి, చదరంగంలో పెద్దచెయ్యే" అన్నాడు గడుస్తనంగా పంతులు.

"అది కాదయ్యా, మనిషెలాంటివాడు" అన్నాడు నాయుడు విసుగ్గా.

"ఆ విషయం నాకంత బాగా తెలీదు. ఏదో సాయంత్రంపూటో ఆటవేస్తాం గాని అంతకుమించి నాకంతబాగా తెలీదు"

"పిల్ల పెళ్ళీడు కొచ్చిందికదా! ఎలా చెయ్యదల్చుకున్నాడు పెళ్ళి?"

"ఆ విషయం కూడా సమంగా తెలీదు."

"ఏవేఁనా వెనకేశాడా!"

"నాకేం నిజంగా తెలీదు."

"వెనకేం ఆస్తి అంతగా లేదుల్లే."

"అహాఁ!"

"నీవంటే గురేనా?"

"బతిమాలుకొని ఓ బంట్రోతుద్యోగం ఎవరికేనా వేయించగల్నేమోగాని అంతకుమించి నాకేం పలుకుబడిలేదు."

"చల్లకొచ్చి ముంత దాచడవెందుకు పంతులూ! నా కేస్సంగతి తెలుసుగదా! ఎలాగైనా నన్నీకేసు గెలిపించిపెట్టాలి. నీకష్టం నేనుంచుగోను, పనయ్యేక వెయ్యిన్నూట పదహార్లు నీకు ముట్టచెప్తా. నీ కొడుకుని రివిన్యూ యినస్పెక్టరుచేస్తా. పిల్లవాడివి ఆలోచించుగో" తేల్చేశాడు నాయుడు.

"బాబ్బాబు, నన్నందులో కిడ్చకండి బాబోయ్. లేగపెయ్యని, తవఁదెబ్బలాటల్లో నలిగి చస్తాను. బాబోయ్! రాజుగారికీమాట తెలిస్తే నా కొంపంటింపించేస్తాడు. నాయిల్లు పీకింపించేస్తాడు. తవఁమాట వింటేనే పెరట్లోకి చెంబట్టుకు పరిగెత్తాల్సి వస్తూంది. తవఁరిక్కడే కూర్చోండి. చిటికెలో వచ్చేస్తా!" అంటూ పెరట్లోకి పరిగెత్తేడు. కాని చెంబట్టుకొని మాత్రం కాదు. పెరట్లో చీకట్లో గున్నమామిడి చెట్టుకింద నిల్చొని లంకాకు చుట్టంటించి ఓ ఐదునిమిషాలు లెక్కలు కట్టేడు. అంచనాలు వేశాడు. తన ఆలోచన అతనికి సంతుష్టికరంగానే కనిపించింది. తను కట్టిన లెక్క రెండెళ్ళు నాలుగన్నట్టు సరిపోయింది. నాయుడికి నమ్మకం పుట్టించేందుకు కాళ్ళు కడుక్కుని, తనలోపల కలిగినసంతుష్టి దిగమింగి, ఆవఁదం తాగినట్టు మొహంపెట్టి నాయుడు దగ్గరకెళ్ళి స్తంభానికానుకొని నేల్నచతికిలపడ్డాడు.

"ఏవాఁలోచించేవు పంతులూ?" అనడిగేశాడు నాయుడు. కాని పంతులేం మాట్లాడలేదు.

"నువ్వనవసరంగా కంగారుపడకయ్యా! మీ జడ్జిగారైనా ఏవంత పతివ్రతకాడట రాజమండ్రిలో పని చేస్తున్నప్పుడు ఎవరో కిరస్తానీ అమ్మాయిని పట్టుగేడ్చిన రకవేఁనట. అక్కడిలాంటి కేసులు ఒకట్రెండిట్లో కతికిన రకవేఁనట. నువ్వనవసరంగా బెంగెట్టుకోకు" అని నాయుడు ధైర్యం చెప్పేడు.

పంతులింకేం మాట్లాడకపోతే బాగుండదని "కాని నాకేదో భయం వేస్తోంది. బెడిసికొట్టితే జైలుకెళ్ళిపోవాలి" అన్నాడు చలిలేకపోయినా వణకుతున్న గొంతుకతో.

"నువ్వు జైలుకెళ్తే, నీ కుటుంబం భారం అంతా నేను మోస్తాను. కాని నువ్వు కాదనకు" అన్నాడు నాయుడు.

కొంత తర్జనభర్జనయ్యేక, సాయం చెయ్యడానికొప్పుకున్నాడు పంతులు. కాని నే చెప్పినంతమాత్రాన పన్జరగదు. ఇంకేవైఁనా ఉపాయవాఁలోచించండి" అన్నాడు.

ఉపాయానికేవిఁటయ్యా? ఒహటే ఉపాయం. డబ్బిచ్చికొంటమే మనం చేయగలిగింది" అన్నాడు నాయుడు.

ఆఖరికి నాయుడు తనకు వీలైనంత పైకంతెచ్చి మర్నాటి రాత్రి పంతులు, కివ్వడానికి, పంతులు ఆపైకం జడిగారి కివ్వడానికి ఒప్పందం అయిపోయింది వాళ్ళిద్దరి మధ్య.

"కాని ఒక్కమాట," అన్నాడు పంతులు. నాయుడు లేవబోతూవుంటే," తవఁ కానీ నా కొద్దు. మనమనుకున్న ప్రకారం పనికాకపోతే, డబ్బుకక్కుర్తిపడి నేనే తవఁరు డబ్బివ్వలేదనొచ్చు. "మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయ నమో నమః" అని వూరికే అన్లేదు మన వాళ్ళు. అంచేత నావల్ల ఓ ప్రోనోట్టుచ్చుగోడాని కంగీకరించాలి

---

- మేజస్ట్రేటు పోలీసుతో : వాడు తాగివున్నట్టు ఎలా కనిపెట్టావు ?

పోలీసు : పెళ్ళాన్ని అదే పనిగా చావగొడుతుండగా పట్టుకున్నానండి.

మేజిస్ట్రేటు : వాడు తాగినట్టు ఎలా తెలిసిందీ అంటున్నాను.

పోలీసు : అప్పుడక్కడ వాడి పెళ్ళాం లేదండి.

"తవఁరు" అని పరతు పెట్టేడు. నాయుడు సరేనని లేవబోతూవుంటే "మరో పరతు" అని ఆపేశాడు పంతులు. "తవఁరూ, నేనూ కలుసుకున్న ట్టెవరికైనా తెల్సిందంటే కొంప మునిగిపోతుంది. రాజుగారికి తెలిస్తే యిహ చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏదేవైనా, నేను కబురెడితే తప్ప, జడ్జిమెంటు చెప్పిన పది రోజుల వరకూ తవఁరు నావేపు కూడా చూడకూడదు. అంతా ఆలోచించే చెప్తున్నా నీమాట" అన్నాడు. యీ పరతుక్కూడా వప్పుకున్నాడు నాయుడు.

"సూన్నారాయణ్రాజు కాటుకుక్కలా కరుస్తున్నాడటుగా" అంటూ సాగనంపాడు పంతులు నాయుణ్ణి.

మర్నాడు రాత్రి ఊరంతా నిద్రపోయేక నాయుడు పంతులికి అయిదు వేలిచ్చేడు. వద్దంటున్నా ఆయన జేబులో పెట్టేడు పంతులు తాను స్వదస్తూరీని వ్రాసిన ప్రోనోటు.

## 8

రెండోనాడు సాయంత్రం జడ్జిగారు పెందరాళే వచ్చేరింటికి. పంతులెంతకీ రాకపోవడం చూసి కబురెట్టేరు జవాన్ని. జవాను తిరిగొచ్చి పంతులింట్లో లేడన్నాడు ...

మసక చీకటి పడుతూండగా పంతులే హాజరయ్యేడు జడ్జిగారింటి దగ్గర. "ఏదో బజారెళ్ళాల్సొచ్చింది. అంచేత ఆలీసవఁయిపోయిం"దన్నాడు కుర్చీలో కూర్చుని చదరంగం బలం పేరుస్తూ.

"ఆటకేంగానండీ పంతులుగారూ! మీకో పసందైన మాట చెప్పాలి" అన్నారు జడ్జిగారు.

"చిత్తం! సెలవీండి" అన్నాడు పంతులు బలం పేరుస్తూనే.

"ఈవేళో ఉత్తరం వచ్చింది. ఎవ్రరాశారో దాన్లో లేదుగాని, యీ ఎలక్షను కేసులో వో పార్టీట. వాడు నాకివ్వడానికి అయిదువేలు తవఁ దగ్గరుంచేట్ట. నాకు డబ్బాశ వుంటే మిమ్మల్నడిగి తీసుకో మన్నాడు" అన్నారు జడ్జిగారు.

పంతులు చిరునవ్వు చెరిగిపోనీకుండా చదరంగం బలం పేరుస్తూనే ఉన్నాడు.

"ఏ వెధవ రాసేడో తెలిస్తే జైలుక్కట్టేద్దును" అన్నారు జడ్జిగారు.

"ఉంటారు బాబూ!" అన్నాడు పంతులు బలం పేర్చడం మాని. "ఉంటారు. ఎంతగానో వుంటారీ రోజుల్లో. తవఁరు నన్ను కాస్త దయతో చూస్తే గిట్టనివాళ్ళెందరో వుంటారు. కేవలం ఘోరకలి" అన్నాడు.

"అంతేనండీ! ఈ వెధవ ఎలక్షన్లంటేనే అంత. ఎంత మంచివాణ్ణయినా చెరిపేస్తాయి" అన్నాడు జడ్జిగారు చదరంగాని కుపక్రమిస్తూ.

ఆట మధ్యలో యీ ఎలక్షను కేసు తట్టో, మట్టో తేలేవరకు జడ్జిగారి దగ్గరకు రావడం మానేస్తే ఉభయత్రా మంచిదని తన అభిప్రాయం వెలిబుచ్చేడు పంతులు.

"ఇలాంటి వెధవ ఆకాశరామన్న ఉత్తరాలికి జడిస్తే యింక పన్చేసినట్టే నేను. అసలీ విషయం మీతో అనడం మానేద్దామనుకున్నాను. మీరేమీ భయపడకండి. మామూలుగానే వస్తూండండి" అని జడ్జిగారు ధైర్యం చెప్పేరు.

మరో మూడ్రోజులికి చీకటి పడ్డాక రాజుగారుకూడా పంతులింటికెళ్ళేరు. వారితోకూడా "నేనేం అపరాధం చేశాను నన్ను శిక్షించడానికి? కాకితో కబురంపితే తవఁ పాదాలవద్ద వాల్నా? ఏదేవైఁనా కుచేలుడింటికి కృష్ణుడొచ్చినట్టుంది" అన్నాడు పంతులు. వారితోమాట్లాడుతున్నప్పుడు మాత్రం పెరట్లో కెళ్ళాల్సిన అవసరం లేకపోయింది పంతులుకి పూర్వానుభవం వుండబట్టి. ఈ మారు మాత్రం కరెంటు పోయిన అవకాశం చూసుగొని రాజుగారు "యివి చేతులుకావు. కాళ్ళనుకోండి పంతులుగ్గారూ" అంటూ తనచేతులు పట్టుకునే వరకూ, వారికి సహాయం చేయడానికొప్పుకోలేదు పంతులు. వారు మర్నాటి రాత్రి పంతులుకి పది వేలిచ్చారు. వారు వద్దంటున్నా, పంతులు ఆ మొత్తానికో ప్రోనోటు రాసిచ్చేడు. వారుకూడా జడ్జిమెంటు చెప్పిన పదిరోజులవరకూ తనవేపు చూడనైనా కూడదని పరతు పెట్టేడు. "వాయిదా వేయించేద్దామని చూస్తున్నాడటుగా ఉమాపతి" అంటూ వార్ని సాగనంపేడు.

దసరా దగ్గర కొస్తున్నకొద్దీ ఎలక్షను కేసు జోరుగా సాగుతూ వచ్చింది. ఉమాపతి ఎంత ప్రయత్నం చేసినా కేసు వాయిదాలు పడటం లేదు. సూన్నారాయణ్రాజు కోర్టులో సాక్షుల్ని కరిచేస్తూనే వున్నాడు. కేసు కోలాహలంగా జరుగుతోంది. ఎడల్ట్ స్కూలు విద్యార్థుల ఊరేగింపులా ఉభయపక్షాల అనుచరులు కోర్టుకి వెళ్తూ వచ్చారు.

ఆఖరికెలాగైతేనేం ఆర్గుమెంట్లు దగరకొచ్చింది కేసు. రాజుగారి జీపునిండా "లా" పుస్తకాలు పట్టుకొచ్చేడు సూన్నారాయణరాజుగారు. తనట్రాక్టరుకు ట్రెయిలరు కట్టి దాంట్లో పట్టించుకొచ్చేడు నాయుడు తన వకీలు ఉమాపతికి కావలసిన పుస్తకాలు ఆర్గుమెంటు ప్రారంభించిన రోజుదయాన్నే నాయుడు ఈశ్వరాలయంలో రుద్రాభిషేకం చేయించేడు. ఆ మర్నాడు రాజుగారు తమ ధర్మపత్నితోసహా సత్యన్నారాయణ వ్రతంచేసి, కేసు గెలిస్తే తన ఏకైక పుత్రుణ్ణి తిరుపతితీసుకెళ్ళి అతనిజుట్టు— రాజుగారిది కాదు, కొడుకుది — యిచ్చేస్తానని మొక్కుకున్నాడు.

సూర్యనారాయణ్రాజుగారు రెండురోజులు చెప్పేరు ఆర్గుమెంటు. ఉమాపతిగారు లేస్తూ "మొదట్లో

నేనుకూడా రెండ్రోజులు ఆర్గుమెంటు చెప్పాల్సుంటుందని అనుకున్నాను కాని, నా స్నేహితుడి ఆర్గుమెంటు విన్నాక, రెండుగంటలకన్నా చెప్పడానికి నా కీ కేసులో ఏం కనిపించడంలేదు" అంటూ ఆరంభించి గంటా ఏభై నిమిషాల్లో ముగించేసేరు ఆర్గ్యుమెంటు.

కేసు ముగిసిపోయింది. మర్నాటి నుండి కోర్టుకి దసరా సెలవులు. దసరా దాటి పడింది జడ్జిమెంటు వాయిదా.

## 9

పట్టుపరికిణీల్తో, బొమ్మల కొలువుల్తో వచ్చింది దసరా. దసరా సెలవల ముందురోజుల్లో ఎలక్షను కేసు జడ్జిమెంటు డిక్టేటుచేసేసి, పెళ్ళాం పిల్లల్తో తన పిల్లలు లేని తమ్ముడింటికి వెళ్ళి శలవు లైపోయేవరకూ వుందామని జడ్జిగారు ప్లానువేశారు. రాజమండ్రిలో పిల్లల్లేని ఆయన తమ్ముడు డాక్టరు.

జడ్జిగారు తాను ప్లాను వేసుగోడంలో తనకు రాబోయే రొంప మరచిపోయేరు. దసరా శలవల్లూ, రొంపా ఒక్కసారే వచ్చేయాయనకి. రొంప మిరియాల కషాయంతో వదలక, రెండోనాటికల్లా చిన్నజ్వరంగా మారి పెన్సిలిన్ ఇంజక్షనుకోరుకుంది జడ్జిగారు తుమ్ముతూ, దగ్గుతూ పక్కమీదే గడిపేశారు పదిరోజుల శలవుల్లో మొదటి నాలుగు రోజులు. నాన్నజ్వరం ఎంతట తగ్గుతుందా, ఎప్పుడు రాజమండ్రి వెళ్దామా అని కాసుక్కూర్చున్నవారి పిల్లలకి అయిదోనాడు "యీ దసరాకి రాజమండ్రి ప్రయాణం కేన్సిల్" అన్న జడ్జిగారి మాటలు పిడుగుల్లా వినిపించేయి. క్రితంరోజు వాళ్ళుచూసిన సినీమాలో నాయిక చెవుల్లో విలన్ అన్న మాటలు, అవి అన్న తర్వాత రింగు రింగు మన్నట్టు, జడ్జిగారి మాటలు వాళ్ళ చెవుల్లో రింగు మనసాగేయి. వాళ్ళ నిరుత్సాహంచూసి "ఎలాగైనా వీలుచూసుకోండి. పాపం పిల్లలు సరదాపడుతున్నారు" అని సుగుణమ్మ అంటున్న టైముకి దిగేడు పంతులు "ఏవిటి పిల్లల సరదా అంటున్నారు" అంటూ.

తల్లికీ, తండ్రికీ అవకాశం యివ్వకుండా పిల్లలే చెప్పేశారు పంతులుతో అంతా. "దానికేం భాగ్యం రేపు నేనే రాజమండ్రం వెళ్తామనుకుంటున్నాను, మా మేనత్తకూతుర్ని చూడ్డానికి. ఎవర్తొస్తారోరండి తీసిగెళ్తా" అన్నాడు పంతులు. పెళ్ళీడుకొచ్చిన రాధ మినహా మిగతా పిల్లల్ని పంతులు రాజమండ్రి తీసుగెళ్ళడానికి, సెలవులాఖర్ని పదో తారీఖు పూరీపాసింజరులో తిరిగి తీసుకొచ్చిడానికీ ఏర్పాటయింది.

పంతులు ప్రయాణం అయ్యేలోగా తాను రాజమండ్రి వెళ్తున్నానని,



తొమ్మిదోతారీఖు పూరీ పాసింజర్లో తిరిగి వస్తానని, రాజుగారికి, నాయుడికి విడి విడిగా తెలియచేశాడు. అంతేగాకుండా కారణాలు అడక్కుండా తమ జీపు డ్రైవరుని తొమ్మిదో తారీఖుని రైలుకి స్టేషనుకి పంపమని రాజుగారికీ, ఆ రైల్లో తమవూరికి నాలుగు స్టేషను ముందు కలుసుకొనేటట్టు ఏర్పాటుచేసి తన బావమరిదిని పంపమని నాయుడి కి కబురు పెట్టేడు.

పువ్వుల్లో పెట్టి తీసుకెళ్ళేడు పంతులు పిల్లల్ని. తనకి అనుకోకుండా పని తగిలిందని, అనుకొన్న తొమ్మిదో తారీఖు రైల్లో ప్రయాణం కట్టించేడు వాళ్ళని. నాల్గు స్టేషన్లు ముందుకలుసుకున్నాడు అతన్ని నాయుడు బావమరది. మాట్లాడ వద్దన్నట్టు సైగచేసి అతన్ని ఊరుకోపెట్టేశాడు పంతులు.

తమ ఊరికి ముందు స్టేషన్లో పంతులు జడ్జిగారి పిల్లల్తో "ఇంక మనం ఊరువచ్చేసినట్టే. నాకిక్కడో చిన్నపనుంది. ఇదిగో యితను మిమ్మల్ని భద్రంగా దిగబెట్టేస్తాడు. మరేం ఫర్వాలేదు" అంటూ తాను ముందుగా కొన్న పెద్ద చాకలెట్లు డబ్బా వాళ్ళకి యిచ్చేడు. జడ్జిగారింటి సందుచివరదాకా మాత్రంవాళ్ళని దిగబెట్టమని నాయుడు బావమరిదిని ప్లాటుపారంమీద హెచ్చరించి తాను దిగిపోయేడు ముందు స్టేషన్లో. మర్నాడువెళ్ళి జడ్జిగారితో తనదూరబ్బంధువు తమపక్క ఊళ్లో అకస్మాత్తుగా చచ్చిపోయిందనీ అంచేత ఒక రోజుముందుగానే వచ్చేసి ముందు స్టేషన్లో దిగిపోయేనని చెప్పేడు పంతులు.

## 10

పెద్దవానలో తెరిచేరు కోర్టు శలవులాఖర్ని. తీర్పుకోసం జనం కోర్టులో కిటకిటలాడుతున్నారు. పైపందెంరేటు బ్రహ్మాండంగా పెరిగిపోయింది. కోర్టుకిరానిది రాజుగారూ, నాయుడే. సినిమాహాల్లో టెలిఫోను దగ్గరకూర్చున్నాడునాయుడు. సొంతహాల్లోఫోన్దగ్గిరకూర్చున్నారు రాజుగారు. ఇద్దరి బ్లడ్ప్రెషరూ రెండొందలయాభై దగ్గరుంది. ఫ్రేము కట్టించిన వెంకటేశ్వర మహాత్యం పోస్టరువైపే చూస్తున్నాడునాయుడు. తమ వేలికున్న సాయిబాబా ఉంగరం అస్తమానూ కళ్ళకద్దుకుంటున్నారు రాజుగారు. శక్తిపూజ చేసేవాళ్ళలా యిద్దరి నుదుర్లమీదా పెద్దసైజు కుంకుంబొట్టున్నాయి. సస్పెన్సు పిక్చర్లో బేక్గ్రౌండు మ్యూజిక్లా మోగుతున్నాయి వారి హృదయాల్లో శబ్దాలు.

జడ్జిగారికి యీ వాతావరణం కొత్తగానూ, సంతోషంగానూ వుంది. తానుచేసే ప్రతిపనీ అతి అత్రంగా చూస్తున్నారు ప్రజలు. అంచేత లంచికి దిగేముందు చెబుదామనుకున్న జడ్జిమెంటు లంచినుండి వచ్చేక చెప్పేరు. కేసు ఖర్చులతో

కొట్టేశారన్నతీర్పు కోర్టులో పిడుగు పడ్డట్టనిపించింది రాజుగారి అనుచరులికి. కోర్టవతల మైదానంలో నిజంగానే పిడుగుపడి ఓ కుళ్ళుకుక్క చచ్చిపోయింది.

"జడ్జిగారింత దగుల్బాజీ అనుకోలేదు" అన్నారు రాజుగారి అసిస్టెంట్లు.

"దేవుఁడిలాంటి మనిషి" అన్నారు నాయుడి పార్టీ.

"మా మినిష్టరుతో చెప్పి జడ్జీని ఈ వేసంగిలో ట్రాన్స్ఫరు చేయించేస్తాం" అన్నారు రాజుగారిపార్టీ.

"అదీ మంచిదే! మంచివాణ్ణి ఎప్పుడూ మనమే అట్టేపెట్టేసుకుంటే ఎలా?" అన్నారు నాయుడిపార్టీ.

తీర్పుచెప్పిన తర్వాత వారం రోజులు రాజుగారిల్లు కదల్లేదు. ఆ వారం రోజులూ నాయుడిల్లు చేరలేదు. ఆ వారంరోజులూ గాలివాన కూడా వదల్లేదు.

తీర్పుచెప్పిన మూడోరాత్రి పదిగంటలకే నిద్రొస్తోంది రాజుగారికి, ముందు రెండురాత్రులూ నిద్ర రాకపోవడంవల్ల. నిద్ర పోదామని సర్దుకుంటూ వుండగా వీధితలుపు చప్పుడైంది. ఈ అర్ధరాత్రి ఎవరొచ్చి వుంటారా అని తలుపు తీసినరాజుగారికి, తడిసిపోయి, నెత్తిమీద తువ్వాలుతో మొహం సహం కప్పుకొని పంతులు కన్పించేడు. రాజుగారు మాట్లాడకుండా హాల్లోకి వచ్చి కూర్చున్నారు. వారి వెనకాలే వచ్చి పంతులు వారిచేతులు పట్టుకున్నాడు.

ముక్కు ఎగపీల్చేడు.


చేతులు వదిలేశాడు.

వారిచ్చిన పదివేలూ వున్న ప్లాస్టిక్ కవరు తీసి చేతిలో పట్టుకున్నాడు.

"నన్నేం అడక్కండి" అన్నాడు.

గొంతు బొంగురు పోయింది. పడిశంవల్ల కాబోలు.

"నేనేం చెప్పలేకుండా వున్నాను. ఏం చెప్పడానికీ నోర్రాకుండా వుంది" అన్నాడు. రాజుగారేమీ అడగందే మళ్ళీ ప్రారంభించేడు. "మనిషన్యేక సిగ్గుండాలి బాబూ! సిగ్గు. ఆ జడ్జికి లేపోతే నాకుంది. ఈ మూర్రోజులు తమఁకి మొహం చూపించలేకపోయేను. కాని ఎన్నాళ్ళు మొయ్యనీ భారం?" అని చేతిలోని డబ్బుకవరు ఊపేడు. ఒక్కొక్కక్షణం అగి "ఇంత దగా చేస్తాడనుకోలేదు బాబూ! నేనెక్కడ దగాచేశేనని తమఁరను కుంటారన్న చింతతో నేను చస్తున్నా. ఏంచేశాడో చెప్తే నమ్ముతారా! తమఁరొచ్చిన మొన్నాడే చెప్పేసేను ఆయనతో మనసంగతి. "అలాగే పంతులూ దానికేం?" అన్నాడు. "బాబూ నాకీభారం వద్దు, తమఁపైకం తమఁరు తీసుగోండి" అంటే, "దానికేం తొందరయ్యా? నీ దగ్గరుంటే ఒహాటీ నా వద్దుంటే ఒహాటీనా! నీదగ్గరే వుండనీ" అన్నాడు. "శలవులు సహం అయ్యేవరకూ వుండి, "నా వల్లకాదు పంతులూ! నాయుడికి సాక్ష్యం బాగా వచ్చిందన్నాడు. నాయుడికి సాక్ష్యం ఏమిటి! నా మొహం. నాయుడి దగ్గర్నించి బాగా ముట్టిందని చెప్పగూడదూ? యిలా నట్టేట్లో ముంచేశాక రాజమంద్రం పరిగెత్తేను ఆయనగారి తమ్ముడి దగ్గరికి. ఈయనకున్నపాటి సిగ్గూ లేదు ఆ తమ్ముడికి. నాయుడు అదివరకే 20 వేలకి కుదుర్చుకున్నాడని, 10 వేలు ఎడ్వాన్సు యిచ్చేడని, మిగతా పదివేలు తొమ్మిదోతారీఖుకి వస్తాయని అన్నాడు. బాబ్బాబు! నేను 25 వేలిచ్చుగుంటానని




మీరు తప్పక చదవవలసినవి
జ్యోతి బుక్స్‌వారి రెండు పుస్తకాలు

కూనలమ్మ పదాలు [ఆరుద్ర రచన]
(అదనపు పదాలతోసహా రెండవ ముద్రణ)
వెల: రూపాయి; పోస్టేజితోసహా రు. 1-68

రసికజనమనోభిరామం
(గోల్డెన్ ట్రెజరీ ఆఫ్ హ్యూమర్)
వెల: రూపాయి; పోస్టేజితోసహా రు. 1-68

ప్రతులకు:
జ్యోతి బుక్స్, విజయవాడ — 2

కాళ్ళట్టుగున్నాను. లాభం లేదు. అడ్వాన్సు బుకింగయిపోయింద న్నాడు. నేవుండగానే వచ్చేడా నాయుడు బావమర్ది. ఇద్దరూ లోపలి కెళ్ళి గుసగుసలాడేరు. మీదుమిక్కిలి నేను తీసుకెళ్ళినపిల్లల్ని ఆనాయుడు బావమర్ది తీసుకొచ్చేశేడు. మోస పోయేను బాబూ! మోసపోయేను. ఇంకా సిగ్గులేక రోజూ చదరంగం ఆడ్డానికి రమ్మని కబుర్లు పెడు తున్నాడు" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

మరో రెండుకబుర్లు చెప్పి "పైకం లెక్కపెట్టించండి" అంటూ శలవు తీసుకున్నాడు. శలవు పుచ్చుగునే లోగా తాను రాసిచ్చిన ప్రోనోటు తిరిగి పుచ్చుకోవడం మర్చిపోలేదు.

జ్యేష్ఠం వచ్చింది. రెండువేలకి కానీ పెచ్చుకట్నం అడిగితే వీపుచీరేస్తానని తన మేనల్లుడ్నీ, అతని తండ్రినీ బెది రించి రాజేశ్వరిపెళ్ళి అయిందని పించేడు పంతులు. కేసుఅయిపోయిన తర్వాత నాయుడిదగ్గర వసూలుచేసిన వెయ్యిన్నూటపదహార్లుతోనూ, పట్టు పంచల చాపుతోనూ, పెళ్ళిఖర్చులూ, లాంఛనాలూ సరిపెట్టేశేడు. నాయు డిచ్చినదాన్లో మిగిలిన మూడువేలూ "ఏమో! చిన్నపిల్లలకైముకి దేశం బాగుపడదేమో "అనుకుంటూ ఫిక్సెడ్ డిపాజిట్టులో వేశేడు. పెళ్ళికి సగం సరుకు నాయుడు సప్లైచేశేడు.

జడ్జిగారు వచ్చి వధూవరుల నాశీర్వ దించేరు. కథలో కొంతమందికి పంతులు చేసిన యీ క్రిందిపన్లు అర్థంకాలేదు.

రాజుగారికి : తన జీపు డ్రైవరుని తాను రాని రైలుకి పంతులు ఎందుకు పంప మన్నాడో?

నాయుడికి : కేసైపోయిన ఆర్నెల్లు వరకు రాజేశ్వర్రావుని రెవిన్యూ ఇనస్పెక్టరు చెయ్యడానికి పంతు లెందుకొప్పుగోలేదో?

జడ్జిగారికి : తనకి ఆకాశరామన్న ఉత్తరం ఎవ్రరాసేరో?

రాజేశ్వరికి : తనకి కొడుకుపుడితే, ఆ కొడుక్కి సౌజన్యరావని పేరు పెడతానని తనతండ్రి ఎందుకు మొక్కుకున్నాడో ?

నాయుడు బావమరిదికి: ఒక్కమాటూ మాట్లాడనివ్వడానికి తననినాలుగు స్టేషన్ల ముందు పంతులు ఎందుకు కలుసుకోమన్నాడో?

జ్యేష్ఠం వెళ్ళింది. రాజేశ్వరి అత్తా రింటికి వెళ్ళిపోయింది. పాపం రాధ పెళ్ళి మాత్రం వాయిదా పడి పోయింది.

□□□



# శిఖరాలూ సరిహద్దులూ

( గతసంచిక తరువాయి )

## 20

రాజీకి ఆరోగ్యం బాగా లేదని డాక్టర్ ఆమెను బలవంతంగా యింటికి పంపివేశాడు. రెండుమూడు రోజులవరకూ రావద్దనీ, పూర్తిగా విశ్రాంతి తీసుకోమనీ చెప్పాడు. డాక్టర్ సలహా ప్రకారం ఆమె మూడు రోజులు ఇంట్లోనే వుండిపోయింది. పగలూ రాత్రీ పడకమీదనే ఉండి ఏవో ఆలోచనలతో గడుపుతోంది. కేవలం మానసికమైన అశాంతి తప్ప ఆమెకు వేరే జబ్బు ఏమీలేదు. అంతకంతకు మనస్సులో కల్లోలం పెరుగుతోంది, భయాలు భూతాల్లా చుట్టుముట్టుతున్నాయి. పశ్చాత్తాపం మనస్సును కాలుస్తున్నది.

లెఫ్టినెంట్ మాత్రం ఏ కాస్త వీలు దొరికినా మందుసీసా పుచ్చు కుని రాజీ గుడిసెకు వస్తున్నాడు. ఎంతో ప్రేమతో ఆమెకు పరిచర్య చేస్తున్నాడు. అతనిచేత పరిచర్య చేయించుకోవటం ఆమెకు యిష్టం లేదు. వాళ్ళకి ద్రోహంచేస్తూ, వాళ్ళ చేతనే సేవచేయించుకోవటం మహా పాపం. కానీ తను ఎంత వారించినా అతను వినటంలేదు. "నువ్వు రోజూ మా సైనికులు ఎంతోమందికి సేవ చేస్తున్నావు. వారి సేవతోనే నువ్వు యీ స్థితికి వచ్చావు. ఈరోజు యీ ఒక్క సైనికుడి సేవను స్వీకరించ లేవా రాజీ" అని బ్రతిమాలుతున్నాడు.

"అదికాదు లెఫ్టినెంట్. నాకు అసలు ఏ జబ్బూలేదు. జబ్బులేకుండా మందు తీసుకోవటం దేనికి చెప్పు" అన్నది రాజీ.

"జబ్బు ఏమీ లేకుండా యిలా ఎందుకుంటావ్ రాజీ. జబ్బు లేదని నువ్వు అనుకున్నా, చూస్తూ చూస్తూ మేము ఊరుకోగలమా ? నీపట్ల నీకు శ్రద్ధలేకపోయినా నాకైనా ఉండాలి. రోజు రోజుకీ నీవు యిలా అయిపో తుంటే నేను చూడలేను."

"అయినా లెఫ్టినెంట్! నువ్వు ఒక

సీరియల్